క్లుప్తంగా

రేపు మాంసం విక్రయాలు బంద్

నారాయణపేట టౌన్: అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా గురువారం నారాయణపేట మున్సిపల్ పరిధిలోని మాంసం విక్రయాల దుకాణాలు బంద్ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం కోళ్లు, మేకలు, గొర్రెలు, చేపల వధశాల వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. గురువారం మాంసం క్రయ విక్రయాలు జరిపితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా దసరా పండుగ, గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో వ్యాపార, వినియోగదారుల్లో అయోమయం నెలకొంది.

కోతుల నుంచి రక్షించండి



నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని పళ్ల ఎస్సీ వాడ దగ్గర ఉన్న మూల హనుమాన్ దేవాలయం సరిహద్దులో కోతుల బెడద అధికంగా ఉందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. ఆహారం కోసం ఇండ్లలోకి చొరబడుతుండడంతో పాటు బజారులో తిరిగే వారిపై దాడి చేస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి కోతుల బారి నుంచి రక్షించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బకాయి బిల్లులు విడుదల చేయాలి

నారాయణపేట టౌన్: భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లయిమ్స్ వెంటనే విడుదల చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కోరారు. జిల్లా కేంద్రంలోని స్థానిక భగత్‌సింగ్ భవన్ మంగళవారం టీయూసీఐ అనుబంధ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. భవన, ఇతర నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా ఇచ్చే డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని, డెత్ అప్లికేషన్లు తీసుకొని రెండేళ్లు కావొస్తున్నా మంజూరు చేయకపోవడం సరికాదన్నారు. పెండింగ్ క్లైయిమ్స్ వెంటనే విడుదల చేయకపోపతే పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు చెన్నప్ప, కార్యదర్శి నరసింహా పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



మక్తల్: మండలంలోని గుడిగండ్ల గ్రామంలో ఇటీవల కురిసిన వర్షానికి సోమవారం చంద్రప్ప అనే వ్యక్తికి చెందిన ఇల్లు కూలిపోయింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లో బియ్యం, నిత్యవసర వస్తువులు పాడైయ్యాయి. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రజల హక్కులపై అవగాహన

మాగనూర్: మండల పరిధిలోని నేరడగం గ్రామపంచాయతీ ఆవరణలో పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సివిల్ రైటర్స్ డే కార్యక్రమాన్ని నిర్వాహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, పోలీసులు రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కుల గురించి వివరించారు. మూఢనమ్మకాలను నమ్మొద్దని అందరూ కలిసి మెలిసి జీవించాలని సూచించారు. అదే విధంగా ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఉన్న ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని వాటిని చట్ట ప్రకారం పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ బల్‌రాజు, పోలీస్ సిబ్బంది ఉమేష్, నర్సింములు, రాములు పాల్గొన్నారు.

కుక్కల స్వైర విహారం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని 3వ వార్డు శ్రీ నగర్ కాలనీ, శ్యాసన్‌పల్లి రోడ్డు, గాంధీనగర్, సింగర్ వీధులలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. శునకాలతో చిన్నారులకు ప్రమాదం పొంచి ఉందని వార్డు మాజీ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ అన్నారు. వీలైనంత త్వరగా కుక్కలను పట్టుకొని వాటి బారి నుంచి కాలనీవాసులను కాపాడాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. అదే విధంగా కుక్క కాటు వల్ల రేబిస్ వ్యాధి వ్యాపించే ఆస్కారం ఉందని కావునా కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మద్దూరులో సైబర్ మోసం

మద్దూరు: మండలకేంద్రంలోని ఓ వెల్డింగ్ షాప్ యజమానిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. గ్యాస్ వెల్డింగ్ నిర్వహించే రఫీక్ వద్దకు ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి రూ.2వేలు ఫోన్‌పే చేస్తాం.. డబ్బులు ఇమ్మని అడిగారు. అతను నగదు ఇవ్వగా డబ్బులు ఫోన్ పే చేసినట్లు మెసేజ్ చూయించి అక్కడి నుంచి జారుకున్నారు. తీరా అకౌంట్లో డబ్బులు పడకపోవడంతో మోసపోయనని గ్రహించి దుండగుల కోసం ఎంత గాలించినా ఆచూకీ దొరకలేదు. చివరికి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పక్కాగా.. పంటల లెక్క



కోస్గిలో పంట నమోదు చేస్తున్న ఏడీఏ రామకృష్ణ

- పంట నమోదులో అధికారుల బిజీ బిజీ
- క్షేత్ర స్థాయిలో పంటల పరిశీలన
- ప్రత్యేక యాప్‌లో నమోదు

కోస్గి రూరల్: వానాకాలం సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను పక్కాగా నమోదు చేసేందుకు ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టారు. డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా రైతుల నుంచి వివరాల సేకరణలో ఏఈఓలు గ్రామాల బాట పట్టారు. పంటల సాగు వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో రైతులు సాగు చేసిన పంటలను విక్రయించుకునేందుకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

65 పంచాయతీల్లో సర్వే

కోస్గి డివిజన్ వ్యాప్తంగా మొత్తం 65 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 14 వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. ఒక్కొక్క క్లస్టర్‌కు ఐదు నుంచి ఆరు గ్రామాలు ఉండగా వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో వెళ్లి పంటల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మొదటగా గ్రామాల వారీగా పంట సాగు విస్తీర్ణ వివరాలను సేకరించి ఆ తర్వాత ట్యాబ్‌లో నమోదు చేసేవారు. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా ఏఈఓలు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట, సాగు విస్తీర్ణాన్ని పరిశీలించి యాప్‌లో నమోదు చేస్తున్నారు.

పక్కాగా పంటల వివరాలు

డిజిటల్ సర్వేలో భాగంగా క్లస్టర్ వారీగా ఏఈఓలకు సూచించిన గ్రామాలలో రైతు పేరు, సర్వే నంబర్, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాస్ పుస్తకం, ఫోన్ నంబర్‌తో పాటు ఏఏ పంటలు సాగు చేశారనే వివరాలను నమోదు చేస్తారు. ఈ విధానంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా వివరాలు పక్కాగా ఉండేలా సర్వే చేస్తున్నారు. కోస్గి మండల వ్యాప్తంగా మొత్తం 13,331 మంది రైతులు ఉండగా 23,553 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేశారు. సోమవారం నాటికి 3960 ఎకరాల నమోదు, గుండుమాల్ మండలంలో 13430 ఎకరాలకు గాను 3283 ఎకరాల్లో సాగు చేసిన పంట నమోదు, కొత్తపల్లి మండలంలో 5095 ఎకరాల్లో నమోదు, మద్దూర్ మండలంలో 8771 ఎకరాల్లో సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేశారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి..

రైతులు సాగు చేసిన పంట వివరాలను పొలాలకు వెళ్లి పరిశీలించిన తర్వాత నమోదు చేస్తున్నాం. గ్రామ గ్రామాన వెళ్లి పంట వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నాం. పంట నమోదుతో రైతులు సాగు చేసిన క్రాప్‌ను విక్రయించుకోవడానికి అలాగే పంట దెబ్బతిన్నప్పుడు నష్టపరిహారం అందించడానికి ఉపయోగకరంగా ఉంటుంది.

–తిరుపతి, ఏఈఓ, గుండుమాల్ క్లస్టర్

నమోదు చేయించుకోవాలి

రైతులందరూ సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. మూడేళ్ల వరుసగా పంటల నమోదు చేసుకోకపోతే రైతు భరోసా అందదు. ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను డిజిటల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతి రైతు పంట నమోదు చేసుకుంటే దిగుబడిని విక్రయించుకోవడానికి వీలుగా ఉంటుంది.

– రామకృష్ణ, కోస్గి డివిజన్ వ్యవసాయ అధికారి

జాతీయ రహదారిపై గుంత పూడ్చివేత

మరికల్: మహబూబ్‌నగర్–రాయచూర్ జాతీయ రహదారిపై ఏర్పడిన భారీ గుంతను అధికారులు పూడ్చి వేయించారు. ‘గొయ్యి.. పూడ్చేనాథుడు కరవై’ శీర్షికతో సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు మంగళవారం స్పందించారు. సాక్షి ఎఫెక్ట్.. పాక్లేన్‌తో రోడ్డుపై పడ్డ గుంతలో రాళ్లు, కంకర, బీటీ వేసి మరమ్మతు చేశారు. గుంతను పూడ్చి వేసి తమ ఇబ్బందులు తొలగించినందుకు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.



మట్టితో పూడుస్తున్న సిబ్బంది

యూరియా కష్టాలు తీరేనా?

మరికల్: మండల కేంద్రంలో యూరియా కోసం రైతన్నలు బారులు తీరారు. మండలంలోని ఓ ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణానికి ఒక లారీ లోడు యూరియా రావడంతో మంగళవారం ఉదయం నుంచే రైతులు వరుసలో నిలబడి యూరియాను తీసుకెళ్లారు. దుకాణ యాజమానులు ఆధార్ కార్డు నంబర్‌ను నమోదు చేసుకొని, వేలిముద్రాలను తీసుకొని ఒక్కొక్క రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియాను అందజేశారు. రైతులకు అవసరమైన మేరకు యూరియాను పంపిణీ చేస్తున్నట్లు ఏఓ రహ్మాన్ తెలిపారు.



యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చున్న రైతులు

దుర్గామాత అలంకరణలో అమ్మవారు



గుడిగండ్లలో కొలువుదీరిన దుర్గామాత



ఎలిగండ్లలో దుర్గాదేవి అవతారంలో అమ్మవారు

నారాయణపేట రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 9వ రోజు మంగళవారం అమ్మవారు సరస్వతీ మాతగా దర్శనం ఇచ్చింది. మండలంలోని సింగారం గ్రామ శ్రీగిరి పీఠంపై భవానిమాత ఆలయంతో పాటు కోటకొండ వాసవిమాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు సర్వదర్శనం అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు.

మక్తల్: మండలంలోని గుడిగండ్ల గ్రామంలో మంగళవారం దుర్గావమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి కర్రెమ్మ దేవాలయం వరకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మరికల్: దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారు మంగళవారం భక్తులకు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

80 అడుగుల ధ్వజస్తంభం ఏర్పాటు

దసరా ఉత్సవాల్లో భాగంగా మరికల్‌లోని దసరా కట్ట దగ్గర 80 అడుగుల భారీ ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. దసరా పండగ రోజున దీనిని ఆవిష్కరించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. స్తంభం ప్రారంభ వేడుకలకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని సూచించారు.

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్ అంబ్రత్రయ క్షేత్రంలో మంగళవారం ఘనంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు సిద్ధి దాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదిత్య పరాశ్రీ ఆధ్వర్యంలో లక్ష పసుపుఅర్చన, చండీ యాగం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సింగారం శ్రీగిరి పీఠంపై..

ధన్వాడ: మండలంలో మారుతినగర్ ఉత్సవ కమిటీ, స్థానిక రజక సంఘం, బీసీ కాలనీలో, గంగాదేవి ఆలయం, వీరభద్రేశ్వరస్వామి దేవాలయం ,అంబాభవాని ఆలయం, దత్తాత్రేయ ఆలయంలో అమ్మవారిని దుర్గదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న నటి

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ సంత్ మత మూల మహా సంస్థానం శక్తి పీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాలలో తెలుగు సినీనటి శ్రీమతి రాగిణి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యారంగ సమస్యలపై ప్రత్యేక దృష్టి

నారాయణపేట: అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తూ విద్యారంగాన్ని ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంఈఓ, జీహెచ్‌ఎంలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశమై పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా విద్యార్థుల నమోదు, ఆధార్ లింకేజీ, టీసీ ఆమోదాలు, మిస్సింగ్ స్టూడెంట్స్ వివరాలు కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. అలాగే పాఠశాలల్లో మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీరు లేని చోట్ల తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచి, పెండింగ్ ఉన్న రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో డిజిటల్ లెర్నింగ్ కోసం అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న నాన్‌–టీచింగ్ పోస్టులను నియమావళి ప్రకారం తక్షణమే భర్తీ చేయాలని సూచించారు. అక్టోబర్ 15 నాటికి ప్రతి అంశంలో ఫలితాలు సాధించాలన్నారు. సమీక్షలో జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు, ఏఎంఓ విద్యాసాగర్, సీఎంఓ రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

స్థానిక సంస్థల ఎన్నికలకు సహకరించాలి

నారాయణపేట: స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అంశాలపై మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని పార్టీలు కూడా సహకారం అందించాలన్నారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, జెడ్పీ సీఈఓ మొగులప్ప, డీపీఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కృష్ణా: మండలంలోని నది పరివాహక ప్రాంతాల్లో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వాసునగర్‌లో ఇళ్లలోకి చేరిన వరద నీటిని, మునిగిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణ సహాయంగా వరద బాధితులను ఆదుకోవాలని, అదే విధంగా ముంపునకు గురవుతున్న ప్రాంతాలను గుర్తించి వారికి శాశ్వత పరిష్కారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివరాజ్‌పాటీల్, అంబ్రేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

అసలైన మాదిగలకే రిజర్వేషన్ కల్పించండి

కొత్తపల్లి: మండలపరిధిలోని అసలైన మాదిగలకే ఎస్సీ రిజర్వేషన్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని భూనీడు గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గ్రామానికి చెందిన యువకులు గ్రామపెద్దలతో కలిసి కొత్తపల్లి మండల తహసీల్దార్ జయరాములుకు, ఎంపీడీఓ కృష్ణారావ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గోకరప్ప మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీ జనాభా 700 ఉండగా ఇందులో 70 శాతం మంది క్రిస్టియన్ మతంలో చేరినట్లు తెలిపారు. అయినా క్రిస్టియన్ మతంలో ఉంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ కేటగిరి కింద పోటీ చేయడానికి పావులు కదుపుతున్నారన్నారు. అధికారులు స్పందించి నిజమైన ఎస్సీలకు రిజర్వేషన్ అమలు అయ్యేలా చూడాలని కోరారు. బీజేపి మాజీ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కోట్ల రవీందర్ రెడ్డి, కుమ్మరి వెంకట్, తిరుపతి రెడ్డి, హన్మంత్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

చేతులపై మోసుకెళ్లి పింఛన్ ఇప్పించారు

దామరగిద్ద: పింఛన్ కోసం ఓ యువకుడు తన నానమ్మను చేతుల్లో మోసుకెళ్లి పింఛన్ ఇప్పించిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. చాకలోన్‌పల్లి గ్రామానికి చెందిన చాకలి భాగ్యమ్మ (80) ఆసరా పింఛన్‌ను కోసం బీపీఎం దగ్గరకు వెళ్ళాల్సి ఉంది. అయితే భాగ్యమ్మ నడవలేని స్థితిలో ఉండగా ఇంటి దగ్గరకే వచ్చి పింఛన్ ఇవ్వాలని కోరగా బీపీఎం రమ్య అందుకు ఒప్పుకోలేదు. వాహన సౌకర్యం కూడా లేకపోవడంతో చివరికే మనవడే తన నానమ్మను దాదాపు అర కిలోమీటరు ఎత్తుకెళ్లి పింఛన్ ఇప్పించాడు. పింఛన్ కోసం వృద్ధులు పడుతున్న కష్టాలకు ఈ ఘటన అద్దం పడుతుంది.



నానమ్మను మోసుకెళ్తున్న మనుమడు

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు

మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్ గ్రామంలో అంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కవి రచయిత శ్రీనివాసులు మాట్లాడారూ.. ఆర్ఎస్ఎస్ వందేళ్ల వేడుకలలో ప్రతి కుటుంబ భాగస్వామ్యం పంచుకోవాలని తెలిపారు. 1930లో నాటి కోల్‌కత్తా మేయర్ సుభాష్ చంద్రబోస్ ముందుండి ప్రజలతో దుర్గామాత పూజలు చేయించారన్నారు. గ్రామ పెద్దలు గుంటగారి అశోక్, మక్తల్ ఖండ సహ కార్యవాహ బాల్‌రాజ్, శంకరోళ్ల రవి కుమార్ పాల్గొన్నారు.

దేశరక్షణలో ముందుండాలి

ధన్వాడ: ప్రతి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త దేశరక్షణ కోసం ముందుండలని హిందు వాహిని ప్రాంత సహయోజకులు హరిచంద్ర అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయదశమి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.



మాట్లాడుతున్న హరిచంద్ర

మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలి



మక్తల్: గురుకుల పోస్టులను మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలని అభ్యర్థులు కోరారు. ఈ మేరకు మంగళవారం అభ్యర్థులు నర్సింహ, శివరాజ్, ఆలీంపాష, మహరాజ్ , చెన్నారెడ్డి, రాకేశ్, సుహస్ మక్తల్‌లో మంత్రి క్యాంపు కార్యాయలంలో మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. 18 వందల మంది మెరిట్ అభ్యర్థలకు న్యాయం చేయాలని విన్నవించారు. హైకోర్టు తీర్పును గౌరవించి ఖాళీలుగా మిగిలిన వాటిని భర్తీ చేయాలని కోరారు.

రంగారెడ్డి కలెక్టర్‌ను కలిసిన వీణ



నారాయణపేట రూరల్: నారాయణపేటకు చెందిన వీణ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులు కావడంతో శిక్షణ నిమిత్తం రంగారెడ్డి జిల్లాకు కేటాయించారు. ఈ మేరకు మంగళవారం అక్కడి జిల్లా కలెక్టరేట్ లో రిపోర్ట్ చేశారు. అనంతరం రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

కోడ్ కూసింది.. ముసుగు పడింది



మరికల్: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పల్లెలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో అధికారులు మంగళవారం మరికల్‌లో జాతీయ రహదారిపై ఉన్న రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు కవర్లతో ముసుగు వేశారు. అలాగే రోడ్డుపై అక్కడక్కడ ఉన్న రాజకీయ పార్టీల బ్యానర్లను పంచాయతీ కార్మికులు తొలగించారు.

సేవాభావం కలిగి ఉండాలి

ఊట్కూరు: ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలని జమాతే ఇస్లామిక్ వింగ్ రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ అన్నారు. మంగళవారం ఊట్కూరులోని పంచ్ మజీద్ ఆవరణలో జేఐహెచ్ ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా సమావేశం నిర్వహించారు. అన్ని మతాల సారం ఒకటేనని, పరమత సహనం గొప్పదన్నారు. కార్యక్రమంలో జావెద్, మహ్మద్ రఫీ, ఇబాదూర్ రహెమాన్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

‘బొందల్‌కుంట’ గా కొనసాగించండి

మక్తల్: మండలంలోని నర్సిరెడ్డిపల్లి గ్రామం పేరును మార్చి బొందల్‌కుంటగా పెట్టాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామానికి ఏళ్ల నుంచి బొందల్‌కుంట పేరే ఉందని ప్రభుత్వం మధ్యలో మార్చినట్లు తెలిపారు. తమ గ్రామానికి పాత పేరును కొనసాగించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు

దామరగిద్ద/మద్దూరు: మండలంలోని హిందు నగర్ గ్రామ పంచాతీయ సమీపంలో ప్రతిష్ఠించిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో మంగళవారం భోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు సమూహిక భోనాలతో ఊరేగింపు నిర్వహించారు.

గంగమ్మ ఒడికి గౌరమ్మ

కోస్గి రూరల్: పట్టణంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. వేడుకలలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు పట్టణ అధ్యక్షుడు బెజ్జు రాములు ఆడిపాడి సందడి చేశారు. అనంతరం సమీపంలోని బందం చెరువులో నిమజ్జనం చేశారు.

పవిత్ర గ్రంథాల పంపిణీ

కొత్తపల్లి: మండల పరిధిలోని నిడ్జింత గ్రామానికి చెందిన ఛత్రపతి శివాజీ యువజన సంఘాల ఆధ్వర్యంలో వెన్న ముద్దల బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. వివేకానంద కూడలిలో బతుకమ్మలను ఉంచి ఆడిపాడారు. అనంతరం బతుకమ్మను తీసుకొచ్చిన ఆడపడుచులకు భగవద్గీత, రామాయణం పుస్తకాలను అందజేశారు.



బతుకమ్మ ఆడుతున్న వార్ల విజయ్‌కుమార్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఒకే దగ్గర కలిసిన పూర్వ విద్యార్థులు

మరికల్: మండలంలోని కన్మనూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 1991–92లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 33 ఏళ్ల తర్వాత పాఠశాల ఆవరణలో కలుసుకొని ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం ఒకరి బాగోగులు ఒకరు తెలుసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు.

విద్యుత్ స్తంభాలను తొలగించాలి

కొత్తపల్లి: మండల పరిధిలోని ప్రధాన రహదారులపై అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి మండలంలో మద్దూరు నుంచి లింగాల్ చేడ్ వరకు, కొటకొండ నుంచి గుండుమాల్ వరకు, లింగాల్ చేడ్ నుంచి గుండుమాల్ వరకు డబుల్ రోడ్ నిర్మాణాలు దాదాపు పూర్తి కావొచ్చినా రోడ్లకు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్‌లను అధికారులు తొలగించలేదు. దీంతో హైటెన్షన్ తీగలు వేలాడుతుండడతో భారీ వాహనాలు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. దీనిపై ఆర్ అండ్‌బీ అధికారులను వివరణ కోరగా ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి రోడ్డుకు సమీపంలో ఉన్న స్తంభాలను, ట్రాన్స్‌పార్మర్‌లను తొలగిస్తామన్నారు.



కొత్తపల్లి–మన్నాపూర్ రోడ్డుపై ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం